కథ

# సహజ

డా.కొఠారి వాణీచలపతిరావు

నేను, సహజ రోడ్డుమీద నడుస్తున్నాం.

మే నెల ఎండ అగ్నిలా మండుతూంది.

"ఎండ బాగుందికదే పిండి ఆరబోసినట్లున్న వెన్నెలలా?" అంది సహజ.

"ఎండ బాగుండటం ఏంటి నీ మొహం? ఒక పక్కన వేడి, మరో పక్కన చెమట చిత్తడితో చస్తుంటే వెన్నెలలో వున్నట్టు చల్లగా ఉందా నీకు?" అన్నాను.

నేను అలా అంటూండగానే సహజ కుడికాలు చెప్పు పుటుక్కున తెగింది. అది చూసి "బాగయింది. వెన్నెల్లో..బృందావనంలో నడిచినట్టుంటుంది..ఇక నడువ్..!" అన్నాను నవ్వుతూ.

చెప్పును చేతిలోకి తీసుకుని "జీవితా! పాపం ఈ చెప్పును చూడు.. 'వళ్ళంతా కుట్లబాధతో నొప్పిపుట్టి ఛస్తున్నాను. ఇకనైనా నాకు విముక్తి కలిగించు' అన్నట్టు నా వంక జాలిగా ఎలా చూస్తోందో! నేను మాత్రం 'మనది జన్మ జన్మల బంధం' అంటూ దీన్ని వదలలేకపోతున్నాను" అంది సహజ.

చెప్పులు చేతిలో పట్టుకుని నడుస్తున్న దాన్ని చూసి "కొత్తవి కొనుక్కోవచ్చు కదా?" అన్నాను.

"కొనుక్కోవచ్చు..కానీ దేనికయినా టైమ్ రావాలి కదా?" అంది.

"బోడి చెప్పులు కొనుక్కోవటానికి కూడా వేదాంతమా?"

"చీమ కుట్టాలన్నా శివుడాజ్ఞ కావాలట.."


"అబ్బ! ఎలా నడుస్తున్నావే చెప్పులు లేకుండా. కాళ్ళు కాలడం లేదూ?"

"కాలుతున్నాయంటే కాలుతున్నాయి. లేదనుకుంటే లేదు..!"

"అనుకోవటం ఏమిటే నీ మొహం! నువ్వు 'లేదు' అనుకుంటే కాళ్ళు కాలటం మానేస్తాయా? నువ్వేం మాట్లాడుతున్నావో నాకెలాగూ అర్థం కాదు. నీకయినా అర్థమవుతుందా అని నా అనుమానం. అది సరేగానీ అదిగో...ఆ చెట్టు కింద చెప్పులు కుట్టే అతను ఉన్నాడు. చెప్పుకుట్టించుకుందువుగాని రా..." అనగానే ఇద్దరం అటువైపు నడిచాం. చెప్పుకుట్టడం అయిపోయినా..ఇంకా హ్యాండ్ బ్యాగులో చెయ్యి పెట్టని సహజను చూసి "చిల్లర లేదా..? నేనివ్వనా?" అని అడిగాను.

"చిల్లరేంటి...అసలు డబ్బులే లేవు నా దగ్గర..నువ్వే..ఇవ్వు..!" అంది.

దాని ఆ నిర్మొహమాటలలో నాకేదో దగ్గరితనం కనిపించి ఎందుకో చాలా హాయిగా అనిపించింది. అదిచ్చిన చనువుతో నేనూ అలాగే మాట్లాడాను.





"ఆ మాత్రం డబ్బులు లేకపోవటం ఏమిటే బ్యాగులో! ఇప్పుడు ఇంటికెలా వెళతావ్? బస్ పాస్ కూడా లేదుగా?"

"నడిచి...!"

"అంత దూరం నడిచా...!"

"వాకింగ్ వంటికి మంచిది...తెల్సా?"

"ఇంత ఎండలోనా? అసలు మీ డాడీ నీకు పాకెట్ మనీ ఎందుకివ్వరు?"

"నెలాఖరు వస్తే నాన్న పాకెట్‌లోనే డబ్బులుండవు.

ఇంక నాకేం ఇస్తారు. అడిగితే అప్పోసప్పో చేసి దబ్బులు తెస్తారని భయం. అందుకే అడగను..."

"ఆయన దగ్గర దబ్బులు ఉన్నదీ..లేనిదీ నీకెలా తెలుస్తుంది?"

"నాన్న స్నానానికి వెళ్ళినప్పుడో, అన్నం తింటున్నప్పుడో మెల్లగా షర్టులోనుంచి పర్స్ తీసి చూస్తా..!"

"అలమారాలో ఉంటాయేమో..?"

"మా ఇంట్లో అసలు ఇనప అలమారానే లేదు. కట్టలు, కట్టలు దబ్బులు, నగలు, వెండిసామాన్లు, ఎఫ్.డిలు ఉండవు గనుక దాని అవసరం కూడా వుండదు"

"అసలు అలమారాలే లేవా మీ ఇంట్లో?!"

"నాకు, చెల్లాయిలకు కలిపి ఒక చెక్క అలమారా వుంది. అందులోని మూడు అరల్లో ముగ్గురం బట్టలు పెట్టుకుంటాం. గోడలోనే ఉన్న సిమెంట్ అలమారాలోని మూడు అరల్లో ముగ్గురం పుస్తకాలు పెట్టుకుంటాం. తమ్ముడి బట్టలకు, పుస్తకాలకు కలిపి వాడి గదిలో రెండు అరలు, మరో సిమెంట్ అలమారా వుంది"

"నీకు ప్రత్యేకంగా ఒక గది అంటూ లేదా?!"

"మా ముగ్గురు సిస్టర్స్‌కి కలిపి ఒక గది! తమ్ముడు, నాన్న ఒక గదిలో పడుకుంటారు. అమ్మ మా దగ్గరే పడుకుంటుంది" అంది సహజ.

"మీ ఇల్లు చాలా చిన్నదన్నమాట! అయితే మీరు చాలా బీదవాళ్ళు!" అన్నాను నేను, విశాలంగా ఉండే మా ఇల్లు గుర్తుకు రాగా.

"ఏం కాదు. మేం ధనవంతులం!" అంది సహజ ఠక్కున. ఆశ్చర్యంగానూ...అర్థం కానట్టుగానూ చూసాను దానివంక.

"ఇందాక నేను చెప్పులు కుట్టించుకున్నాను చూడు...అతను, అదిగో బండిమీద అరటిపండ్లు అమ్ముతున్నాడు చూడు..ఆ అబ్బాయి, ఫుట్‌పాత్ మీద కూర్చుని పాత సామాన్లుకొంటున్నాడే అదిగో...అతను, వాళ్ళందరికన్నా మేము ధనవంతులమే!"

"మన క్లాస్‌మేట్ ఐశ్వర్య వుంది చూడు. రోజుకో కొత్తడ్రస్ వేసుకుని, ఖరీదయినా నగలు పెట్టుకుని కారులో వస్తుందీ...ఆ అమ్మాయి రతన్ టాటా, ముఖేష్ అంబానీలతో పోలిస్తే చాలా బీదది పాపం!" అంది సహజ చాలా మామూలు విషయం మాట్లాడుతున్నట్లుగా. నాకు మాత్రం అదేదో చాలా కఠినమైన పజిల్‌లా అనిపించింది. దాని గురించి ఆలోచించి తలబద్దలు కొట్టుకునే సమయం, సందర్భం అవి కావు గనుక నా

## టైమ్ బాగుంది

కాజల్ అగర్వాల్‌కి ఇప్పుడు టైమ్ బాగా కలిసొస్తోంది. తొలి చిత్రం 'లక్ష్మీకల్యాణం' ఫ్లాపయినా కూడా మంచి మంచి బ్యానర్‌లలో ఆఫర్లు రావడం అంటే అదృష్టం కాక మరేమిటి? రామ్‌చరణ్‌తో 'ధీరుడు', అల్లు అర్జున్‌తో 'ఆర్య-2'లో నటిస్తున్న కాజల్‌కి ఎన్టీఆర్‌తో కూడా నటించే చాన్సు చేరువలో వుందిట. అలాగే మరికొన్ని ప్రముఖ బ్యానర్ల సినిమాల్లో నటించే చాన్సులు ఆమె కోసం ఎదురుచూస్తున్నాయనేది ఫిలింనగర్‌లో తాజా సమాచారం. ఎంతయినా కాజల్ లక్కీయే.



దారిన నేను పోవటానికి నిర్ణయించుకుని అంతలోనే సడన్‌గా ఏదో గుర్తొచ్చినట్టు బ్యాగ్‌లో నుంచి ఇరవై రూపాయల కాగితం తీసి "సహజా! ఇదిగో ఇది తీసుకుని ఇంటికి ఆటోలో వెళ్ళు..ఈ టైమ్‌లో బస్సులు కూడా ఎక్కువ వుండవు" అన్నాను.

"అవసరం పడినప్పుడు..ఇందాకటిలా అడిగి మరీ తీసుకుంటాను గానీ ప్రస్తుతానికి ఉండనీ.." అంది సహజ.

"నడిచి వెళ్తావా? సన్‌స్ట్రోక్ తగిలి చస్తావ్...!" అన్నాను కోపంగా.

దానికి సమాధానంగా ఓ చిరునవ్వు నవ్వి..అక్కడే ఎదురుగా అండర్ కన్‌స్ట్రక్షన్‌లో ఉన్న ఓ ఫ్లై వోవర్ వంక చూపుడువేలుతో చూపిస్తూ "ఆ కూలీలు రోజంతా..అలా మండే ఎండలోనే పనిచేస్తారు. వాళ్ళు ఛస్తున్నారా? ఎండ కన్నెరుగని రాకుమారివి నువ్వయితే కావొచ్చు గానీ నేను కాదు. ఎండ, వాన, చలి ఇవన్నీ నా నేస్తాలు!" అంది సహజ.

నా ప్రతి మాటను అది అలా ఖండిస్తుంటే వళ్ళు మండిపోయి "అయితే నీ దారిన నువ్వెళ్ళు. నడిచే వెళ్తావో, మళ్ళీ చెప్పు తెగితే కథాకళీ చేసుకుంటూ వెళ్తావో..నాకెందుకు..నా దారిన నేను వెళ్తాను" అంటూ ఆటో పిలవబోతున్న నన్ను "ఒక్క నిముషం ఉండు" అంటూ ఠక్కున చెయ్యి పట్టుకుని ఆపింది సహజ. తనూ నట్టనడిరోడ్డుమీద సడన్‌గా ఆగిపోతూ.

"ఎందుకు" అన్నట్టు వెనక్కు తిరిగి చూసాను.

"మంచి పాట వస్తోంది..విను!" అంది. రోడ్డుకు ఎడంవైపు ఉన్న ఓ ఇంట్లోనుంచి సన్నగా టీవీలోనుంచి వస్తున్న పాటను చెవి వొగ్గి వింటూ.. "నిదురించే తోటలోకీ..పాట ఒకటి వచ్చిందీ..కన్నుల్లో నీరు తుడిచీ.. కమ్మని కల ఇచ్చిందీ.." సుశీల కమ్మటి కంఠం..దేవులపల్లి సాహిత్యం..సహజ పాటలంటే చెవికోసుకుంటుందని తెలుసుగానీ..ఆ చెవి కోసుకోవటానికి మరీ సమయ సందర్భాలు ఉండవని ఆరోజే నాకు తెలిసింది.

"పాత పాట!" అన్నాను కావాలనే.

"పాత పాట, కొత్తపాట అని వుండవు. మంచి పాట, మామూలు పాట అని తప్ప. అలా అనుకుంటే భువనచంద్ర రాసిన 'మౌనంగానే ఎదగమనీ..మొక్క నీకు చెబుతుందీ..ఎదిగినకొద్దీ వొదగమనీ అర్థమందులో వుంది..' అన్న పాటకూడా నాకు చాలా ఇష్టం" అంది కూనిరాగం తీస్తూ.

"అబ్బబ్బ..నీ టేస్ట్‌లు, నీ కళారాధనలు ఇలా ఎండలో నన్ను రోడ్డుమీద నిలబెట్టి ఏకరువు పెడతావేంటే తల్లీ...ఒకపక్క నెత్తి మాడుతోంది. చెమటలు కారిపోతున్నా.." అన్నాను చిరాకుపడిపోతూ.

ఇంతలో ఆ రోడ్డుమీద ఎవరిదో వి.ఐ.పీ కాన్వాయ్ వస్తున్నట్లుగా సైరన్...మోటర్ సైకిళ్ళ మీద పైలెట్లు, పక్కన సెక్యూరిటీ గార్డ్స్, పోలీసులతో క్షణంలో రోడ్డంతా హడావుడిగా తయారయింది. రయ్యి రయ్యిన

సుడిగాలిలా ఒకదానివెంట ఒకటి నాలుగుకార్లు దూసుకెళ్ళాయి.

"సి.ఎమ్. వెళుతున్నాడు..." అన్నారు ఎవరో పక్క నుంచి.

ఆ హోదాని, ఆ ప్రోటోకాల్‌ని ఇంతింత కళ్ళు చేసుకుని ఆశ్చర్యంగా చూసాను నేను.

"పాపం...వి.ఐ.పీస్" అంది సానుభూతిగా సహజ.

"అదేంటే..అంత దర్జాగా ఆయన వెళుతుంటే...'పాపం' అంటావ్? ఏ కొద్దిమందికో దక్కే అదృష్టం అది..." అన్నాను.

"అదృష్టమో..ఏమో! నాకు మాత్రం వాళ్ళను చూస్తుంటే జాలేస్తుందే. ఏ..సీ..చాంబర్‌లోనో..తన ఇంట్లో నాలుగు గోడల మధ్యనో, రక్షణ వలయం మధ్య ఇలా బులెట్ కార్లోనో తప్ప మనలా వాళ్ళు ఇలా రోడ్డు మీద ఫ్రెండ్‌తో సరదాగా మాట్లాడుకుంటూ నడవగలరా? ఓ ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి పాటో, ఓ శోభానాయుడి నృత్యమో, ఓ మంచి పుస్తకమో ఆస్వాదించగల ఓపిక, తీరిక వారికి ఉంటాయా? ఎంతయినా జీవితం అంటే సామాన్యుడిదేనే..! భగవంతుడు ఓ వరంగా తనకు ఇచ్చిన జీవితాన్ని ఆనందంగా, సుఖంగా, సౌలభ్యంగా ఎలా తీర్చిదిద్దుకోవాలో సామాన్యునికి తెలిసినంతగా పదవుల చట్రంలో బిగుసుకుపోయిన వి.ఐ.పీస్‌కు తెలియదు-" అంది సహజ.



సాధారణ జీవితంలోని ఆనందాన్ని నెమలి పురి విప్పినట్టు అది అంత అందంగా చెబుతుంటే నాకూ నిజమే అనిపించింది ఒక్కక్షణం. ఆ తర్వాత అంతలోనే మళ్ళీ నా మనను 'అధికారం, అందరూ వంగి వంగి సలాములు చేసే హోదా, ఆ అహం, దర్పం అన్నీ కళ్ళ ముందు మెదిలి మిశ్రమభావాల మధ్య కాసేపు ఊగులాడాను.

'అది' నా ముఖంలో కనిపించిందో ఏమో సహజకు..చిరువ్వుతో చిన్న చురక అంటించింది.

"నీ పేరు జీవిత...కానీ నీకు జీవితం అంటే అర్థం తెలీదు" అని!

"నీకు తెలుసా పెద్ద?" అన్నాను రోషంలో నుంచి తన్నుకుని రాగా.

"చదివితే ఎందుకు అర్థం కాదు ఎవరికయినా? నువ్వు చదవవు అంతే.." అంది పెద్ద ఆరిందాలా.

"చదవటానికి అదేమయినా పుస్తకమా? అయినా ఎందుకు చదవాలి? ఆ సబ్జెక్ట్‌లో మనమేమయినా పరీక్ష రాయబోతున్నామా?" అన్నాను.

"అలా అనుకుంటున్నావా..పెద్ద పరీక్షలే ఉంటాయి అందులో...ఫెయిలయితే మళ్ళీ రీ ఎగ్జామ్‌లు, గ్రేస్ మార్కులు లాంటివి వుండవు" అంది నవ్వుతూ.

అప్పటికే ఇద్దరం క్రాస్‌రోడ్స్ దాకా వచ్చాం. నేను ఎడమవైపు వెళ్ళాలి. తను కుడివైపు.

"వస్తానే..ఇప్పటికే నీ పుణ్యమా అని ఎండలో మాడి సగం రోస్ట్ అయ్యాను. నువ్వు చెప్పిన లైఫ్ సబ్జెక్ట్ చదవటానికి, అందులో పరీక్ష రాయడానికి ప్రయత్నిస్తాను నేను కూడా!" వ్యంగ్యానికి హాస్యం జోడించి 'దీనిని బాగానే ఆట పట్టించాను' అనుకుంటూ..కావాలని దానిముందే ఆటో పిలిచి అందులో కూర్చుని 'బై' చెప్పాను.

చిరునవ్వుతో తనూ చెయ్యి ఊపింది సహజ.

★ ★ ★

మా క్లాస్‌మేట్ గాయత్రి పెళ్ళి ఆ రోజు. సంప్రదాయం పేరుతో ఛాందసత్వాన్ని పాటించే కుటుంబంలో నుంచి వచ్చిన తను డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే పెద్దవాళ్ళ ప్రోద్భలంతో బావను పెళ్ళి చేసుకుంటోంది.

రెండురోజుల క్రితం నుంచే 'పెళ్ళికి వెళ్ళాలి...' అన్న ప్రోగ్రామ్ తాలూకు ఆలోచనలు నా మెదడును బిజీ చేసేసాయి.

"ఏం చీరకట్టుకెళ్ళాలి..ఏం నగలు పెట్టుకెళ్ళాలి?" అన్నదే నా దుగ్ధ.

అలమారా నిండా డ్రస్సులు, చీరలు, లాకర్ నిండా వెరయిటీ నగలు ఉంటే అంతగా ఆలోచించేదాన్ని కాదేమో. ఉన్నవి మూడో, నాలుగో డ్రస్సులు అనే చీరలు. మెడలోకి ఓ సెట్ ఉంది కానీ..అది పాతకాలం నగలా మోటుగా ఉంటుంది. మిగతావి సింపుల్‌గా ఉండే చెయిన్లు. పిచ్చికోపం వస్తోంది అమ్మ మీద నాకు!

"ఈ కొంపలో ఎప్పుడూ దరిద్రమే...అనువైన బట్టలుండవు..నగలు ఉండవ్. ఎలా వెళ్ళను ఈరోజు మా ఫ్రెండ్ పెళ్ళికి?" అన్నాను పెద్దగొంతుతో అరుస్తూ..చిరాకుపడుతూ.

"ఏమయిందే..? ఉన్నవి చాలవా..పోనీ నా చీర కట్టుకెళ్ళు!" అంది అమ్మ.

"ఆ మోటు కంచి పట్టుచీరలు, ధర్మవరం చీరలా? ఇప్పుడు వర్క్ శారీస్ ఫ్యాషన్ తెల్సా..ఒక్కొక్కళ్ళు ఎలా తయారై వస్తారో తెల్సా..సిగ్గేస్తుంది నాకు వాళ్ళ మధ్య..." అన్నాను ఐశ్వర్య కళ్ళముందు మెదులుతుండగా. ఒక ఫంక్షన్‌కు కట్టిన చీర..మరో ఫంక్షన్‌కు కట్టకుండా కట్టుకొస్తుంది అది..! ఏ చీర మీదకు ఆ చీర మ్యాచింగ్ సెట్..! ఎంత బాగుంటుందో చూడటానికి. రెండు కళ్ళు చాలవు. చెలికత్తెల మధ్య రాకుమారిలా ధగధగా మెరిసిపోతూ వుంటుంది. నాలో అలాంటి ఆలోచనలు అంతకంతకూ అధికమవుతున్నకొద్దీ నాకు మనశ్శాంతి లేకుండాపోయింది.

"ఎలా? ఎలా? ఎలా వెళ్ళాలి పెళ్ళికి? ఏం

## ఇంకేం కావాలి

నిన్నటి నవంబర్ 1వ తేదీకి ఐశ్వర్యా రాయ్ తన 35వ ఏట అడుగు పెట్టింది. అయితే ఈసారి బర్త్‌డేకి మణిరత్నం సినిమా షూటింగ్‌తో బిజీగా వుండడం వల్ల ప్రత్యేకమైన సెలబ్రేషన్స్ ఏమీ జరుపుకోలేకపోయింది ఐష్. కానీ ఆ షూటింగ్‌లో ఆమె భర్త అభిషేక్ కూడా వున్నాడు. మరింకేం కావాలి, భర్తగారు చెంతనే వుండగా బర్త్‌డేని షూటింగ్‌లో జరుపుకున్నా ఆ ఆనందమే వేరు కదా! ఈ సినిమా తన కెరీర్‌కి మరో మలుపు తెస్తుందని చెబుతోంది ఐశ్వర్య.

చేయాలి?" ఇదే ఆలోచన చివరకు.

ఆటో దిగి మ్యారేజ్ హాల్లో అడుగుపెడుతున్నప్పుడు కూడా అదే టెన్షన్..నన్ను వదలకుండా, ఎవరు ఎలా అలంకరించుకుని వస్తారో..ఎవరు ఎలాంటి ఖరీదయిన బహుమతులు తెస్తారో అని! ఫ్రెండ్స్ అందరం కలిసి ఒక గిఫ్ట్ కొందామంటే ఒప్పుకోదు ఐశ్వర్య. కాస్ట్లీ గిఫ్ట్ తెచ్చి అందరిలోనూ తన ప్రత్యేకతను, ఐశ్వర్యాన్ని చాటుకోవాలని వుంటుంది దానికి.

నా ముఖంలోనూ, నా నడకలోనూ ఎలాంటి టెన్షన్ కనబడకుండా జాగ్రత్తపడుతూ..చాలా క్యాజువల్‌గా ఉన్నట్టు నటిస్తూ పెళ్ళిమంటపం దగ్గరికి వెళ్ళాను. అప్పటికే వచ్చి పెళ్ళికూతురి వెనక మంటపంలో నిల్చుని ఉన్నారు ఐశ్వర్య, సహజ...ఇంకా చాలామంది మా క్లాసుమేట్స్.

మబ్బుల్లో మెరుపులా, వర్షం వెలిసాక ఆకాశంలో విరిసే ఇంద్రధనుస్సులా కలర్‌ఫుల్‌గా, చెమ్కీ, కుందన్ వర్క్‌లో తళతళా మెరిసిపోతుంది ఐశ్వర్య. 'నిజంగా ఐశ్వర్య అభిరుచికి మెచ్చుకోవాలి!' అనుకుంటూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

"హాయ్ జీవితా" అంటూ నాతో చెయ్యి కలిపి కింది నుంచి పై దాకా తన చురుకైన కళ్ళతో నన్నో చూపు చూసి గర్వంగా నవ్వింది ఐశ్వర్య.

"ఏంటి ఇంత ఆలస్యం...?" అంటూ నా చేతిని సున్నితంగా స్పర్శించి తనూ నవ్వుతూ నావంక చూసింది సహజ. కానీ ఆ చూపులో విమర్శగానీ, ఆ నవ్వులో అహంగానీ లేవు. అలా అని మెచ్చుకోలూ లేదు.

సహజ నా వంక ఎప్పుడు చూసినా, ఏం మాట్లాడినా అందులో జాలి, సానుభూతి ఎందుకుంటాయో నాకు అర్థం కాదు.

నిజంగా అలా ఉంటాయో...లేక నా భ్రమో అర్థం కాదుగానీ దాని పెద్దరికం ముందు నేనో చిన్నపిల్లలా ఒదిగిపోతాను. దాని సూటితనం, సహజత్వం ముందు ఏదో కృత్రిమత్వం నన్ను కుంచింపచేస్తూ ఉంటుంది.

ఐశ్వర్య ఆధిక్యభావమే నన్ను బాధిస్తుంటుంది అనుకునేదాన్ని ఇన్నాళ్ళూ. కానీ నాకు తెలియకుండానే నా లోలోపల సహజ సింప్లిసిటీ కూడా బాధిస్తున్నాయని ఇప్పుడే అర్థమయింది. ఐశ్వర్య కనిపించగానే 'నేను ఇలా వైభవంగా అలంకరించుకోలేకపోయానే' అనిపించింది. ఇప్పుడు సహజను చూస్తుంటే ఆఫ్ వైట్ మంగళగిరి జరీ చీర, ఒక్కవరస ముత్యాల గొలుసు..దానికి ముద్దుగా హాంగ్ అయిన ఒక చిన్న ముత్యం. ఒక చేతికి వాచీ, మరో చేతికి ముత్యాలు పొదిగిన ఒక్క గాజు..కంటికి ఎంత ఇంపుగా, హాయిగా వుంది. కడిగిన ముత్యంలా ఉంది. మెడలోని ముత్యాల గొలుసుతో పోటీ పడుతున్నట్టు పెదవుల మీద నిరంతరం ముత్యంలా మెరిసే నవ్వు. 'సింప్లిసిటీలో కూడా ఇంత అందం, ఇంత హుందాతనం ఉంటాయా!?' ఆశ్చర్యపోయాను నేను. సహజను చూస్తుంటే 'నేను ఇలా సహజసిద్ధంగా తయారై వచ్చినా బాగుండేదేమో' అనిపించింది. అటు ఐశ్వర్యలానూ ఉండలేక, ఇటు సహజలానూ ఉండటం చేతగాక మధ్యలో అయోమయావస్థలో కొట్టుమిట్టాడి సమయాన్ని, డబ్బును వృధా చేసుకున్నానన్న భావం నన్ను కృంగదీసింది. దానికి తోడు భోజనాల దగ్గర ఐశ్వర్య కావాలని నా పక్కకు వచ్చి నిల్చుని "నీ రూబీస్ నెక్లెస్ బాగుంది. బెన్‌టెక్సా, వన్‌గ్రామ్ గోల్డా?" అని అడిగింది.

నా ఫాల్స్‌ప్రిస్టేజీని అది కనిపెట్టడమేగాక, నా మధ్య తరగతి మనస్తత్వాన్ని ఎద్దేవా చేస్తున్నట్టు మాట్లాడేసరికి సిగ్గుతో చితికిపోయాను నేను. ఐశ్వర్య అన్న ఆ మాట సహజ కూడా విన్నట్టుంది. తను అటు వెళ్ళగానే నా దగ్గరికి వచ్చి "మనం..మనంగా వుండటంలో సుఖం వుంది. సౌలభ్యం వుంది. ఎవరినో అనుకరించబోతే ఇలాగే వుంటుంది" అంది ఫ్రెండ్లీగా.

ఆ మాటలు నిజమేనని పించి.."ఇకనుంచి నేనూ నీలా ఉండటానికి ప్రయత్నిస్తాను" అన్నాను.

"నాలాగా ఉండకు. నీలాగా నువ్వు వుండు. అనుకరణలో సహజత్వం ఉండదని చెప్పాగా. నీలోని సహజత్వాన్ని, నీకు మాత్రమే స్వంతమయిన నీ వ్యక్తిత్వాన్ని బయటకు తీసి..అలా ఉండు!" అంది సహజ.

'నాలోని సహజత్వం ఏమిటి? నాకే తెలియని నాదైన వ్యక్తిత్వం అది ఎలా ఉంటుంది' శోధనలో పడిపోయాను నేను.


"జీవిత అని పేరు పెట్టుకున్నావుగానీ జీవితం అంటే నీకు అర్థం తెలియదు" అన్న సహజ స్నేహపూర్వకమైన మందలింపు ఆ సమయంలో నాకు గుర్తొచ్చింది. విశ్లేషణలో పడిపోయాను ఇక!

గాయత్రిని కలవటానికి అందరం మళ్ళీ మంటపంలోకి వెళ్ళాం.

ఐశ్వర్య బ్యాగ్ తెరిచి బంగారు చెవిరింగులను దర్పంగా బయటికి తీసి ప్రజెంట్ చేసింది. సహజ అందంగా ప్యాక్ చేసిన పుస్తకం ఒకటి అంతే దర్పంగా ప్రజెంట్ చేసింది. మిగతావాళ్ళూ ఏవేవో గిఫ్ట్‌లు ఇచ్చారు. నేను అమ్మతో ఏదయినా కొనివ్వవచ్చులే అని వచ్చాను. కానీ- అంతలోనే ఏదో ఆలోచించుకుని ఒక్క నిముషంలో మ్యారేజ్ హాల్ గేటు దగ్గరికి వెళ్ళి ఇరవై ఐదు రూపాయలు పెట్టి 'బొకే' ఒకటి కొని హృదయపూర్వక అభినందనలతో అది గాయత్రికి అందించాను.

ఆశ్చర్యంగా ఐశ్వర్య, చిరునవ్వుతో సహజ ఆ దృశ్యాన్ని చూసారు.

* * *



## పాపం ఆశ!

ఆశా సైనీకి రోజులు బాలేవనే చెప్పుకోవాలి. తన పేరు ఫ్లోరాగా మార్చుకున్నా కలిసిరాలేదు. ఆ తర్వాత 'మయూరి'గా కూడా పేరు మార్చుకుంది. ఫలితం లేదు. ఇటీవల ఒకటి రెండు సినిమాల్లో చాన్సులు వస్తున్నాయి అనుకుంటే ఆ సినిమాలు కూడా ఆమెకి అంతంత మాత్రంగానే గుర్తింపు తెచ్చాయి. ఇప్పటికే టింగడా అయిపోయిన ఆశ కుర్రహీరోయిన్ల పోటీలో ఎలా నిలబడగలదు? హాయిగా పెళ్ళిచేసుకుని సినిమాలకు చెప్పేయవచ్చు కదా అని సినీ జనాలు గుసగుసలాడుకుంటున్నారు.

అప్పుడే నిద్ర లేచాను.

"జీవితా!" అమ్మ ఎందుకో గట్టిగా పిలిచింది. 'ఎందుకలా పిలిచింది!?' అనుకుంటూ బయటికి వెళ్తే "మీ ఫ్రెండ్ సహజ వాళ్ళ నాన్నగారు చనిపోయారట! మీ క్లాస్‌మేట్ రమ ఫోన్ చేసి హడావుడిగా పెట్టేసింది" అంది అమ్మ.

"ఎలా!" ఆశ్చర్యంగా అడిగాను గొంతు పెగుల్చుకొని.


"హార్ట్ ఎటాక్ అట!"

హడావుడిగా బ్రష్ చేసుకుని బట్టలు మార్చుకుని "కాఫీ తాగి వెళ్ళు" అని అమ్మ వెనకనుంచి అంటున్నా వినిపించుకోకుండా బయటపడ్డాను.

ఇంటిముందు జనం..ముందు గదిలో శవం..ఆ ప్రక్కనే కూర్చుని వున్న సహజ అమ్మగారు, చెల్లెళ్ళు కనిపించారు శోకసముద్రంలో మునిగిపోయి.

'సహజ ఏది?' అనుకుంటూండగానే లోపలి నుంచి వస్తూ కనిపించింది. నన్ను చూడగానే అదోలా నవ్వింది. ఆ నవ్వులో..మాటల్లో చెప్పలేనంత దుఃఖం కనిపించింది నాకు.

'రాత్రి పెళ్ళికి అటెండయ్యాం. నాలుగైదు గంటల వ్యవధిలోనే చావుకు! ఎంత విచిత్రం ఈ జీవితం! సుఖదుఃఖాల సమ్మిశ్రితం' అనుకున్నాను నాలో నేను. సహజ లోగొంతుతో అంది. "జరగబోయే దాన్ని ముందుగా ఊహించో ఏమోగానీ నాన్నగారు ఎప్పుడూ అంటూ వుండేవారు.



అమ్మ కడుపులో ఊపిరి పోసుకున్నప్పటి నుంచీ కొన్ని దశాబ్దాలుగా ఒక్క క్షణం ఆగకుండా నిరంతరం కొట్టుకునే గుండె...ఏదో ఒకరోజు అలసి సొలసి ఆగిపోకుండా ఎలా ఉంటుంది. దానికి మాత్రం రెస్ట్ ఉండొద్దా పాపం! అని.

ఆయన జోక్‌గా అన్న ఆ మాటల వెనుక మాకెవ్వరికీ చెప్పకుండా దాచిన రహస్యమేదో ఉండి ఉంటుందని అప్పుడు నాకు తట్టలేదు. తట్టి ఉంటే ఎన్ని ఇబ్బందులున్నా ఆయనకు ఖరీదైన ట్రీట్‌మెంట్ ఇప్పించేదాన్ని. ఆయన అనారోగ్య రహస్యాన్ని నేను కనిపెట్టలేకపోవటానికి కారణం ఆకలిని, దరిద్రాన్ని కూడా జోవియల్‌గా తీసుకునే ఆయన వే ఆఫ్ టాకింగే!

పచ్చగడ్డితో కూడా పచ్చడి బ్రహ్మాండంగా చేయగల నిపుణురాలమ్మా మీ అమ్మ...ఈ పాక కళానైపుణ్యం ఈమెలో లేకుంటే ఒక్క తోటకూరతో ఇన్నిరకాల డిషెస్ చేసి, ఇంత సుష్టుగా భోజనం ఎలా పెట్టగలదు చెప్పు" అనేవారు. అర్థాకలితో పీటమీద నుంచి లేస్తూ కూడా.

చినిగిన ప్యాంటు వేసుకుంటూ ఓ రోజు "చినిగిన బట్టలు ఇప్పుడు వెస్టర్న్ స్టయిలే! ఎన్ని చిరుగులుంటే అంత ఫ్యాషన్, అంత ఖరీదు అన్నమాట. ఏ బోయస్ కాలేజ్ గేటు ముందు నిల్చున్నా చినుగుల సౌందర్యాన్ని ఫ్రీగా చూడొచ్చు" అంటూ తమ్ముడివైపు తిరిగి "నువ్వు కూడా నీ నిక్కరు కాస్త చింపుకోరా..! లేకుంటే పల్లెటూరి పిల్లాడు అనుకుంటారు..." అనేవారు. "నేను కుట్టిఇస్తా ఇవ్వు నాన్నా" అంటే "చినుగుల్ని కుట్టకూడదు. కుడితే బిచ్చగాడనుకుంటారు" అనేవారు" అంది సహజ విషాదంగా నవ్వుతూ.

ఓ వింత లోకంలో సంచరిస్తున్నట్టుగా ఉంది నాకు.

'ప్రతికూల పరిస్థితులను కూడా ఇంత సౌకర్యంగా..ఇంత అనుకూలంగా చేసుకుని నవ్వుతూ బ్రతకగలగడం కొంతమందికే సాధ్యం' అనిపించింది.

★ ★ ★

కాలప్రవాహంలో ఓ నాలుగైదు సంవత్సరాలు కొట్టుకుపోయాయి.

నేను హైదరాబాద్‌లో ఎమ్.సి.ఏ చేసి, సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా క్యాంపస్ సెలక్షన్ సాధించాను... ఓ ఎమ్.ఎన్.సిలో.

ఐశ్వర్య ఓ అమెరికా అబ్బాయిని పెళ్ళి చేసుకుని ఫారెన్ వెళ్ళిపోయింది.

సహజ సంగతి తెలియక చాలా రోజులయింది.

తండ్రి చనిపోయాక..ఇంతకు ముందున్న అద్దె ఇల్లు ఖాళీ చేసి...మరో ఇంటికి షిఫ్ట్ అయ్యారని తెలిసింది.

'ఈసారి ఎలాగయినా తనను కలవాలి' అనుకోగానే మా డిగ్రీ క్లాస్‌మేట్స్‌కి ఫోన్ చేసి సహజ గురించి అడిగాను.

మొత్తానికి గాయత్రి దగ్గర దొరికింది అడ్రస్.

గాయత్రి ఇప్పుడు ఇద్దరి పిల్లల తల్లి అయిందట. పెళ్ళితోపాటే తాని చదువు, కెరీర్ అటకెక్కేసాయని బాధపడింది. 'ఎంతయినా మీరు అదృష్టవంతులే' అని నిట్టూర్చింది.

'జీవితం సహజ సుందరంగా ఉండాలిగానీ యాంత్రికంగా వుండకూడదు. ఎప్పటికప్పుడు ఏదో కొత్తదనం, ఎంతోకొంత ఎదుగుదల వుండాలి గానీ ఉన్నచోటే జీవితం ఆగిపోకూడదు' అనిపించింది గాయత్రితో మాట్లాడాక. జీవితం సహజ సుందరంగా ఉండటం అంటే ఏమిటో ఆ సాయంత్రం సహజ ఇంటిని చూసాక నాకు తెల్సింది.

'పర్ణశాల లాంటి చిన్న ఇల్లు. ఇంటిముందు మినీ గార్డెన్. కుండీలలో రకరకాల పూల మొక్కలు. చిత్ర విచిత్ర క్రోటన్స్ చెక్కగేటుకు అటూ ఇటూ కొలువుతీరి స్వాగతం పలుకుతున్నట్లు ఉన్నాయి. చెట్లమధ్య ఓ పావురాల గూడు కూడా వుంది. ఆర్చిలా కొన్ని, పైకి ఎగబాకుతూ కొన్ని క్రీపర్స్, కన్నులకు పండుగ చేసాయి. పొదరిల్లు లాంటి ఆ ఇల్లు ఒక చెరువు పక్కన ఉండటంతో

## శ్రియ చిటపటలు

ఈమధ్య తరచూ వార్తల్లోకి వస్తోంది శ్రియ. ప్రేమాయణాలు కూడా పబ్లిసిటీ అవుతున్నాయి. వీటిలో తాజాగా క్రికెటర్ శ్రీశాంత్‌తో ఆమె షికార్లు కొడుతోందనేది ఒకటి. దీనిపై ఒక్కసారి మండిపడింది శ్రియ. ఏదో ఎక్కడో ఫంక్షన్లో కలిసి కాస్త సరదాగా మాట్లాడినంత మాత్రాన ఇక ఎఫైర్లు అంటగట్టేయడం ఫ్యాషనైపోయింది. నాకెవరితోనూ ఎలాంటి ఎఫైర్లూ లేవు. అనుకునే వాళ్లు ఎన్నయినా అనుకుంటారు అంటూ చిర్రుబుర్రులాడుతోంది శ్రియ. ఆమెకి ఇంతగా కోపం రావడం మరో కారణం కూడా వుందిట. అదే ఆమె నటించిన ఆంగ్ల చిత్రం ఫ్లాప్ కావడం అట.

చల్లటి పిల్లగాలులు వంటికి తగులుతూ హాయి కలిగిస్తున్నాయి.

'ఇంత చక్కటి టేస్ట్ సహజకు కాకపోతే మరెవరికి ఉంటుంది!' అనుకున్నాను గుమ్మం ముందు నిల్చొని తలుపు కొడుతూ.

ఎదురుగా సహజ! మా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

"వాట్ ఎ ప్లజంట్ సర్ప్రయిజ్! ఎన్నాళ్ళయింది మనం కలిసి" అంటూ తన రెండు చేతులతో నన్ను చుట్టేసింది సహజ.

ఇంట్లోకి వెళ్ళి ముందుగా వాళ్ళ అమ్మగార్ని, చెల్లెళ్ళను పలకరించి, తమ్ముడిని దగ్గరికి తీసుకుని నేను తెచ్చిన స్వీట్స్, ఫ్రూట్స్ ఇచ్చి ఆ తరువాత ఇద్దరం లాన్‌లోని చెయిర్స్‌లో కూర్చున్నాం.

ఎగురుతున్న పావురాల వంక చూస్తూ " కణ్వ మహాముని ఆశ్రమంలో శకుంతలలా ఉన్నావ్!" అన్నాను.

"కణ్వ మహాముని లేని ఆశ్రమంలో అను!" అంది సహజ నిర్లిప్తంగా నవ్వుతూ. అప్పుడు తెలిసింది నాకు నేను చేసిన తప్పు!

"సారీ" అన్నాను వెంటనే వాతావరణాన్ని, తన మూడ్‌ని నార్మల్‌కి తెచ్చే ప్రయత్నంగా.

"నువ్వు ఇప్పుడు ఏం చేస్తున్నావ్ సహజా!" అన్నాను టాపిక్ మారుస్తూ.

"గురుకులం లాంటి ఓ చక్కటి స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాను. సిటీలో అద్దెలు భరించలేక ఊరికి దూరంగా వచ్చేసాం. పెద్దచెల్లి రోజూ కాలేజీకి బస్సులో వెళుతుంది. చిన్నచెల్లి, తమ్ముడు మా స్కూల్‌లోనే చదువుతున్నారు" అంది సహజ.

ఉన్నంతలో జీవితాన్ని ఎంజాయ్ చేయటం సహజకు తెలిసినంతగా మరొకరికి తెలియదేమో అనిపించింది.

"నాన్న లేరన్న బాధ తప్ప...లైఫ్ హాయిగా, తృప్తిగా ఉందే ఇప్పుడు. పిల్లలకు పాఠాలు చెబుతుంటే..వాళ్ళతో ఏర్పడిన అనుబంధాన్ని మనసారా ఆస్వాదిస్తుంటే ఈ ప్రపంచాన్నే జయించినంత ఆనందం కలుగుతుంటుంది నాకు. ఎటు వంచితే అటు వంగే చిన్నపిల్లల మనసులను సమాజ భవిష్యత్తు అనే పందిరి పైకి క్రమక్రమంగా మళ్ళిస్తుంటే ఓ మహాయజ్ఞం చేస్తున్నంత పవిత్రభావం కలిగి మనసు పులకించిపోతుంది."

ఆ మాటలంటున్నప్పుడు దాని కళ్ళల్లో ఎంతటి వెలుగో, దాని మదిలో ఎన్ని ఆనంద సముద్రాలో..అవన్నీ వర్ణించాలంటే కవులకు తప్ప నాకు సాధ్యం కాదు అనిపించింది.

నేను వింటూ కూర్చున్నాను. సహజ మాట్లాడుతూంది.

తను మాట్లాడుతుంటే అలా గంటల తరబడి అయినా వింటూ కూర్చోవటం నాకు ఇష్టం.

"నాన్న గుర్తొచ్చినప్పుడల్లా నేను ఎప్పుడూ ఒకటే అనుకుంటాను. ఈ సృష్టిలో పుట్టుక ఎంత సహజమైందో..చావూ, అంతే సహజం. జీవనగతిలో ఒడుదుడుకులు అత్యంత సహజం కనుక వాటిని సాధారణ విషయాలుగా తీసుకుని జీవితాన్ని ముందుకు నడిపించాల్సిందే- అని. అలా అనుకున్నప్పుడు మనసులోని బాధనంతా ఎవరో చేతితో తీసేసినట్లు అనిపించి తిరిగి మామూలు స్థితికి వచ్చేస్తాను" అంది సహజ.

"ఇంజనీరో, డాక్టరో కాలేదని..ఉన్న జీవితంతో ఎడ్జెస్ట్ అయి బ్రతకాల్సి వస్తున్నదనీ ఎప్పుడూ అనిపించదా నీకు?" అని అడిగాను సహజను.

"నాకు ఇది, ఉన్న జీవితంతో తృప్తిపడుతున్నట్లుగా అనిపించదు. కోరుకున్న జీవితాన్నే పొందానన్న తృప్తి కలుగుతుంది. ఎందుకంటే ఈ సమాజానికి ఇంజనీర్లు, డాక్టర్లు ఎంత అవసరమో టీచర్లూ అంతే అవసరం. భావి పౌరులను తయారుచేసి ఈ సమాజానికి అందించే గురుతర బాధ్యతను నిర్వహిస్తున్నారు గురువులు. ఈ వృత్తిలో మాత్రమే దక్కే గౌరవం ఒకటుంది. అదేంటో చెప్పనా... ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అయినా, ప్రైమ్ మినిస్టర్ అయినా తనకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన గురువు కనిపిస్తే కారు దిగి వచ్చి చేతులు జోడించి నమస్కారం చేస్తారు. అంతటి గౌరవం ఉంది గురువుకు" అంది గర్వంగా సహజ.


చదువు, సంస్కారం, చేస్తున్న పని పట్ల శ్రద్ధ, భక్తి, గౌరవం వల్ల వచ్చిన సహజలోని ఆ ఇగో నాకెంతో నచ్చింది.

ఎవరినీ నొప్పించని అహం..తనను తాను కించపరుచుకోని తత్వం, ఎదుటివాళ్ళ సానుభూతిని ఆశించని నైజం, ఇవన్నీ కలగలిసి సాధారణతలోనే అసాధారణ తను తెచ్చిపెట్టాయి సహజకు. ఆమెలోని ఆ హుందాతనానికి కారణం అదే!

'ఇది నా కర్మ', 'నా దురదృష్టం', 'విధి లీల' అంటూ దేవుడిని, జీవితాన్ని తిట్టుకుంటూ ఈద్వలేక బతుకును ఈడుస్తూ ఎదుటివాళ్ళ సింపతీని, సహాయాన్ని ఆశించే వాళ్ళకు, జీవితాన్ని ఓ వరంగా, పూజాపుష్పంగా భావించి కళ్ళకద్దుకుని స్వీకరించే సహజ లాంటివాళ్ళకు ఎంత వ్యత్యాసం వుంది.

'జీవించటం ఎలాగో సహజను చూసి నేర్చుకోవాలి ఎవరయినా' అనుకున్నాను నేను, తన వంక ఆరాధనగా చూస్తూ.

మనసులోకి ఎప్పుడూ వ్యతిరేక భావాలు, చెడు ఆలోచనలు రానివ్వనివాళ్లు సహజలాగే ఇలా సహజసిద్ధంగా ఈ లోకం మీద ఇష్టంతో, తమ మీద తమకి గౌరవంతో జీవిస్తారేమో అనిపించింది.



## కమలినీ-గోదావరి

కమలినీ ముఖర్జీ ఇప్పటిదాకా నటించిన చాలావరకు సినిమాల్లో ఒక్కసారైనా గోదావరి నది బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తుంది. ఓ పాటలో అయినా బిట్ కోసం అక్కడ షూటింగ్ చేసి వచ్చిందామె. అయితే ఈ ఏడాది ఇంతదాకా ఆమె గోదావరికి వెళ్లలేకపోయానే అని బాధపడుతున్న సమయంలో మళ్లీ ఆ చాన్స్ వచ్చేసిందిట. వంశీ దర్శకత్వం వహిస్తున్న 'గోపి-గోపిక-గోదావరి' సినిమా కోసం కమలినీ గోదావరి నది దగ్గర షూటింగ్‌లో పాల్గొనడంతో తెగ సంబరపడుతోందిట.